12/01/2012

ఈనాడు

# ప్రైవేటు సాగు పెంచాలి

- వ్యవసాయంలో ప్రైవేటుకు తలుపులు తెరవాలి
- బడ్జెట్ ముందస్తు కసరత్తులో ఆర్థికమంత్రికి నిపుణుల సూచన

న్యూఢిల్లీ - న్యూస్‌టుడే

దేశంలో వ్యవసాయ రంగం బతికి బట్టకట్టాలంటే ప్రైవేటు రంగానికి తలుపులు తెరవాలని వ్యవసాయరంగ నిపుణులు, రైతు సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, విత్తన, పరిశోధన- అభివృద్ధి రంగాల్లోకి ప్రైవేటు వారిని ఆహ్వానించాలని సూచించారు. బడ్జెట్ ముందస్తు కసరత్తులో భాగంగా ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ బుధవారం తన కార్యాలయంలో వ్యవసాయరంగ ఉత్పాదకత పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయరంగ నిపుణులు, రైతుసంఘాల నేతలతో భేటీ అయ్యారు. ఇందులో ఆర్థికశాఖ సహాయ మంత్రులు నమోనారాయణ్‌మీనా, పళనిమాణిక్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు, ఆర్థిక, వ్యవసాయశాఖ కార్యదర్శులు, సీఏసీపీ ఛైర్మన్ పాల్గొన్నారు. వీరితోపాటు భారత రైతు సంఘాల సమాఖ్య (సీఫా) సెక్రటరీ జనరల్ పి.చంగల్ రెడ్డి, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి బి.ఎస్.ధిల్లాన్, ఇతర నిపుణులు ఈ భేటీలో పాలుపంచుకున్నారు. ఇందులో ఆర్థికమంత్రి ప్రధానంగా వృద్ధిరేటు లక్ష్యాలను చేరుకోవడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచడం, సరఫరా గొలుసు నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడంపై సూచనలు కోరారు. వ్యవసాయ వృద్ధిరేటును కనీసం 4 శాతానికి పెంచడానికి ఏం చేయాలని అడిగారు. ఈ లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రభుత్వ పెట్టుబడులను పెంచడంతోపాటు ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలని అందరూ అభిప్రాయ పడినట్లు సీఏసీపీ ఛైర్మన్ అశోక్‌గులాటి విలేకర్లతో అన్నారు. సాగునీటి రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలని కోరినట్లు వెల్లడించారు. ఆహార ద్రవ్యోల్బణం తగ్గించాలంటే వ్యవసాయం రంగంలో పెట్టుబడులు పెంచాలని, తద్వారా సరఫరా పెరిగి ద్రవ్యోల్బణం తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమైందన్నారు. చిల్లర రంగంలోకి మల్టీబ్రాండ్ ఎఫ్‌డీఐలకు ప్రవేశం కల్పించాలని చాలామంది కోరినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలపై వడ్డీరేటు తగ్గించాలని, దేశవ్యాప్తంగా ధాన్యం సేకరణ యంత్రాంగాన్ని పటిష్ఠం చేయాలని కోరినట్లు వెల్లడించారు. ధాన్యం సేకరణ యంత్రాంగం సరిగా లేనందువల్ల రైతులు కనీస మద్దతు ధరకంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతు సంఘాల నేతలు తెలిపారన్నారు.

## భారత రైతు సంఘాల సమాఖ్య (సీఫా) సూచనలు

- 4 శాతం వృద్ధిరేటు చేరుకోవాలంటే వాణిజ్యంపై నియంత్రణలను తొలగించడంతోపాటు బియ్యం, గోధుమ, చక్కెర, పత్తి ఎగుమతులకు అవకాశం కల్పించాలి.
- పప్పు దినుసులు, మొక్కజొన్న, ఆలుగడ్డ, ఉద్యాన పంటలకు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- రైస్‌మిల్లింగ్ పరిశ్రమ ఆధునీకరణకు రూ.10వేల కోట్లు ఇవ్వాలి.
- ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో 60 రోజుల్లో బాధితులకు పరిహారం ఇవ్వాలి.

## మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ సూచనలు

జీడీపీలో ప్రస్తుతం 15% ఉన్న వ్యవసాయ రంగం వాటా 2022 నాటికి 8.9%కి పడిపోయే ప్రమాదముందని వ్యవసాయ నిపుణుడు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. ఆయన చేసిన సూచనలివే..

- రాష్ట్రాల స్థాయిలో ధరల నిర్ణాయక సంఘాలను ఏర్పాటు చేయాలి.
- వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నియంత్రణలు తొలగించాలి. దేశంలోపల, బయట ఎక్కడైనా ఉత్పత్తులు అమ్ముకొనే స్వేచ్ఛ రైతులకు కల్పించాలి.
- ఎఫ్‌సీఐ కొనుగోళ్లపై పన్నులు, సెస్సులు తొలగించాలి.
- వృత్తివిద్యా కాలేజీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రిజర్వేషన్లు కల్పించాలి.
- కూలీల కొరతను నివారించడానికి యాంత్రీకరణ పెంచాలి.


ఢిల్లీలో రైతు నేతలతో సమావేశమైన ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ. చిత్రంలో ఆ శాఖ సహాయమంత్రులు నమోనారాయణ, పళని మాణిక్యం, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, రైతు నేత చెంగల్‌రెడ్డి తదితరులు

## వ్యవసాయ రంగంలో ఎఫ్‌డీఐలు రావాలి: అజిత్‌సింగ్

వ్యవసాయరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవేశానికి కేంద్రమంత్రి అజిత్‌సింగ్ మద్దతు తెలిపారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గుతుండటం వల్ల ఎఫ్‌డీఐల రాక రైతులకే ఉపయోగకరమని వివరించారు. ఎస్పీ, బీఎస్పీ కార్యకర్తలు ఆర్ఎల్డీలో చేరిన సందర్భంగా ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రైతులు తమ ఉత్పత్తులకు సరైన మార్కెట్ దొరక్క అవస్థలు పడుతున్నారు. దళారులు లాభపడుతున్నారు. పెద్ద కంపెనీలు వస్తే, అవి నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేయడం వల్ల మేలు జరుగుతుందన్నారు.

# వ్యవసాయంలోకి పెట్టుబడులు పెంచాలి

12-01-2012 - సాక్షి




ప్రణబ్‌తో ప్రీ-బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ రంగ నిపుణులు, ప్రతినిధులు

## ప్రభుత్వానికి నిపుణుల విజ్ఞప్తి

- ప్రీ-బడ్జెట్ సమావేశాలను ప్రారంభించిన ఆర్థిక మంత్రి ప్రణబ్

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగం 4 శాతం వృద్ధి రేటు సాధనకు ఈ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందని కేంద్రానికి నిపుణులు సూచించారు. ఈ దిశలో ప్రభుత్వం తగిన చొరవలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ బుధవారం ఇక్కడ ప్రీ-బడ్జెట్ సంప్రదింపులు ప్రారంభించారు. వ్యవసాయ రంగం ప్రతినిధులతో ప్రారంభమైన ఈ సంప్రదింపుల ప్రక్రియ వివిధ రంగాల ప్రతినిధులు, నిపుణులతో మరో 10 రోజులు కొనసాగుతోంది. నేటి సంప్రదింపుల అనంతరం ప్రసిద్ధ అగ్రి ఎకనమిస్ట్ అశోక్ గులాటి విలేకరులతో మాట్లాడారు. ఆహార ధరలు తగ్గడానికి సరఫరా చైన్‌లో సంస్కరణల అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ప్రస్తుతం వ్యవసాయంలో వార్షికంగా రూ.30,000 కోట్లకు మించి ప్రభుత్వ పెట్టుబడులు రావడంలేదని అన్నారు. బుధవారం జరిగిన ప్రీ-బడ్జెట్ సమావేశంలో గులాటీతోపాటు దాదాపు 15మంది వ్యవసాయ రంగ నిపుణులు పాల్గొని, ఆర్థికమంత్రికి తమ సూచనలు, సలహాలు అందజేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మరింత స్నేహపూర్వకంగా మలచాలని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వై.శివాజీ ఆర్థిక శాఖకు సూచించారు.

**ప్రణబ్ ఏమన్నారంటే...:** ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి ప్రణబ్ మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో సాగుతున్న దృష్ట్యా- ఈ సంక్షోభ నివారణలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. కనుక ఈ రంగం పురోభివృద్ధికి కేంద్రం ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. ఆహార ద్రవ్యోల్బణం అదుపులో వ్యవసాయ దిగుబడులదే కీలకపాత్రని అన్నారు.

# ప్రయివేట్ ఎయిర్‌లైన్స్‌కు బెయిలవుట్ లేదు: అజిత్ సింగ్

**న్యూఢిల్లీ:** ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రయివేట్ విమానయాన సంస్థలకు ఎటువంటి బెయిలవుట్ ప్యాకేజీ ఉండబోదని కేంద్రం స్పష్టం చేసింది. అట్టి సంక్షోభం నుంచి స్వయంగా గట్టెక్కడానికి గట్టి చర్యలు తీసుకోవాల్సిందేనని ఎయిరిండియాకూ సూచించింది. తాము అదేపనిగా నిధులు కుమ్మరించడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ప్రయివేట్ ఎయిర్‌లైన్స్‌కి ప్రభుత్వం బెయిలవుట్ ఇచ్చే పరిస్థితుల్లో లేదని పౌర విమానయాన శాఖ మంత్రి అజిత్ సింగ్ స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త ఏటీసీ టవర్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. దేశీ విమానయాన సంస్థల్లో విదేశీ ఎయిర్‌లైన్స్ వాటాలు తీసుకునే అంశంపై మంత్రుల బృందం త్వరలో నిర్ణయం తీసుకోవచ్చని మంత్రి వివరించారు. ప్రయివేట్ ఎయిర్‌లైన్స్ లాభసాటి ప్రణాళికను రూపొందించుకుంటే, బ్యాంకులు సంతృప్తి చెందితే రుణాలివ్వగలవని ఆయన చెప్పారు.